## Key Area 7 : Leading school administration

# ప్రధాన రంగం : పాఠశాల నిర్వహణకు నేతృత్వం

**మాడ్యూల్ పేరు** : సమ్మిళిత విద్య (Inclusive Education)

**యూనిట్–1** : సమ్మిళిత విద్యాభావన, ఆవశ్యకత

**యూనిట్–2** : సమ్మిళిత విద్య–సవాళ్ళు మరియు వ్యూహాలు

**రచయిత** : **M.** వివేకన్ రెడ్డి,

Professor (Retd.), IASE,

మాసబ్ ట్యాంక్, హైద్రాబాద్.

# సమ్మిళిత విద్య

## పరిచయం

విద్యాభివృద్ధికై కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు అనేక కర్యాక్రమాలు చేపట్టినప్పటికి భారత రాజ్యాంగములో పొందుపరచబడిన సార్వత్రిక ఎలిమెంటరీ విద్యను నేటికి సంపూర్ణంగా సాధించలేదు. ఎలిమెంటరీ విద్యను పూర్తిచేసినవారు కూడ విద్యాప్రమాణాలను ఆశించినమేరకు పొందలేకపోయినారు. కులం, మతం, ప్రాంతం, లింగం, భాష, వైకల్యం మొదలగు వాటికి అతీతంగా పిల్లలందరికి పాఠశాలలో ప్రవేశం కల్పించినప్పటికీ, నేటికి మన పాఠశాలలో పిల్లలు ప్రత్యక్షంగా, అప్రత్యక్షంగా వివక్షకు గురికావడాన్ని మనము గమనించవచ్చును. వివక్ష అంటే అందరిని సమానభావంతో ఒకేలా చూడడం కాకుండా ఒకరిని లేదా ఒక సమూహాన్ని భిన్నంగా చూడడం. భిన్నంగా చూడడం అనేది సాధారణంగా ప్రతికూలంగా అంటే ఒకరిని చులకనగా లేదా తక్కువచేసి చూడడం. వివక్ష ప్రధానంగా కులం, లింగం, భాష, మతం, సంస్కృతి, ప్రాంతం, వైకల్యత, విద్యలో వెనుకబాటుతనం, తల్లిదండ్రుల విద్యాస్థాయి మొదలైనవాటి ప్రాతిపదికన ప్రదర్శిస్తున్నారు. పాఠశాలలో ప్రదర్శించే వివక్షవల్ల అనేక పర్యవసానాలు ఏర్పడతాయి. పిల్లలు పాఠశాలకు సర్దుబాటు కాలేరు. అలాగే బోధనాభ్యసన కార్యక్రమాలలో కూడ చురుకుగా పాల్గొనరు. వివక్ష వలన విద్యార్థులు బడికి రావడం మానేయడం లేదా కొన్ని సందర్భాలలో ఆత్మహత్యకు కూడ దారితీయవచ్చు. 'తరగతి గది' అనేది సమాజం యొక్క సూక్ష్మరూపం. ఈ తరగతి గదులలో భిన్న నేపథ్యాలుగల విద్యార్థులు అంటే వివిధ భాషలు మాట్లాడేవారు, వివిధ కులాల, వివిధ మతాలు, పేదలు, ధనికులు, మొదటితరం అభ్యాసకులు, ప్రత్యేక అవసరాలు కలిగినవారు ఉంటారు. వీరందరి అవసరాలను తీర్చే విద్యనే సమ్మిళిత విద్య. సమ్మిళిత విద్యలో తరగతిలోని భిన్న నేపథ్యాలున్న పిల్లల అనుభవాలు బోధనాభ్యసనకు ఆటంకంగాకాక వనరులుగా ఉపయోగించుకుంటారు. సమ్మిళిత విద్యను అమలుచేసే క్రమములో అనేక సవాళ్ళు ఎదురవుతాయి. ఇవి సౌకర్యాల కొరత, సరళత్వం లోపించిన పాఠ్యప్రణాళిక / విద్యాప్రణాళిక, సమ్మిళిత విద్యపట్ల తల్లిదండ్రుల అననుకూల వైఖరి, సమ్మిళిత విద్యకై ఉపాధ్యాయుల సన్నద్ధత, పాఠశాల యాజమాన్యకమిటి సన్నద్ధత మొదలగునవి కావచ్చును. ఈ సవాళ్ళను అధిగమించుటకు పాఠశాల నాయకత్వమనేది కీలకం. ఎందుకంటే సమ్మిళిత విద్య అమలులో ఎదురగు సవాళ్ళు అన్ని పాఠశాలలో ఒకేవిధంగా ఉండవు, అవి వేరువేరుగా ఉంటాయి. ఆయా పాఠశాలలో ఉండే వనరులు, స్థానిక పరిస్థితులు, స్థానికంగా మాట్లాడే భాష లేదా భాషలు పాఠశాల బోధనాభాషకు భిన్నంగా ఉండటం, స్థానిక సంస్కృతి, ఆచార వ్యవహారాలు, విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యపట్ల ఉండే వైఖరి మొదలగు వాటి ప్రాతిపదికన సవాళ్ళు ఉంటాయి. ఈ సవాళ్ళను అధిగమించుటలో ప్రధానపాత్ర పోషించవలసినది పాఠశాల నాయకత్వం. మరీ ముఖ్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మిళితవిద్య అమలులో ఎలాంటి సవాళ్ళు ఎదురయ్యే అవకాశమున్నదో అంచనా వేయగగాలి. అదేవిధంగా ఎదురయిన సవాళ్ళను అధిగమించుటకు ప్రధానోపాధ్యాయుడు పాఠశాల యాజమాన్య కమిటీతో చర్చించి తగిన వ్యూహాలను రచించుకొని అమలుచేయాలి. పాఠశాల యాజమాన్య కమిటి కేవలం పాఠశాలకు మౌలిక వసతులు కల్పించేందుకు పరిమితం చేయకుండా పాఠశాలకు ఎదురగు సవాళ్ళను పరిష్కరించేందుకు భాగస్వాములు అయ్యే విధంగా చూడాలి. విద్యను ఆర్జించే విద్యార్థులను, వారి తల్లిదండ్రులను,

సమాజ సభ్యులను ఉపాధ్యాయులను అలాగే విద్యాశాఖ అధికారులను సమన్వయపరుస్తూ ప్రతి ఒక్కరు వారి వారి విధులను నిర్వహించే విధంగా ప్రధానోపాధ్యాయుడు చొరవ చూపాలి. పాఠశాల నాయకత్వమనేది అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ఆ పాఠశాలకు అనువుగా వ్యూహాలను రూపొందించుకొని అమలుపరిస్తే సమ్మిళితవిద్య సాఫల్యం కాబడుతుంది. విద్యాక్షేత్రంలో ఉపాధ్యాయులుగా ఉన్న మనం, సమ్మిళితవిద్యపట్ల సరైన అవగాహనను కలిగి ఉంటూ దాని సాఫల్యానికై నిరంతరం కృషిచేస్తేనే పిల్లలందరికి నాణ్యమైన విద్య అందుతుంది. ఇలా చేయకపోతే ముఖ్యంగా వైకల్యం కలిగిన పిల్లలు, అననుకూల వర్గాల పిల్లలు, విద్యకు దూరం కాబడుతారు.

## యూనిట్–1 : సమ్మిళిత విద్య భావన, ఆవశ్యకత

**లక్ష్యాలు : దీనిని చదివిన తరువాత**

1) సమ్మిళిత విద్యాభావనలను గ్రహిస్తారు.
2) సమ్మిళిత విద్య ఆవశ్యకతను గుర్తిస్తారు.

**కీలక / ముఖ్య పదాలు**

- సాంప్రదాయ నమూనా ఆలోచన
- మెడికల్ నమూనా
- సాంఘీక నమూనా
- సల్‌మాన్‌కా చర్యా చట్రం
- యునెస్కో నమూనా
- సి.యస్.ఐ.ఇ. నమూనా
- వైకల్యంగల వ్యక్తుల హక్కుల చట్టం

## పరిచయం

భారత ప్రభుత్వ లక్ష్యమైన ‘‘అందరూ చదవాలి, అందరూ ఎదగాలి’’ని సాధించుటకు కులం, ప్రాంతం, భాష మొదలగు వాటికి అతీతంగా పిల్లలందరికి పాఠశాలలో ప్రవేశాలు కల్పించడం మాత్రమే కాక వారు విద్యా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేలా చూడాలి. విద్యార్థులు పాఠశాలకు, పాఠ్యప్రణాళికకు, బోధానభ్యసన పద్ధతులకు మొదలగు వాటికి సర్దుబాటై చదవగలిగినవారు చదివి, మిగిలినవారు చదువును మధ్యలోనే మానివేయడం లేదా అభ్యసనలో సంపూర్ణంగా పాల్గొనకుండా యాంత్రికంగా పాఠశాలకు వచ్చిపోవడమో కాకుండా ప్రతి ఒక్కరి అభ్యసనానికి ఉన్న ఆటంకాలను గుర్తించి, ఆ ఆటంకాలు లేకుండా చేయడంతోపాటు వారు అభ్యసన ప్రక్రియలో సంపూర్ణంగా భాగస్వాములను చేయడమే సమ్మిళితవిద్య ముఖ్య లక్ష్యం.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటుచేసి, మిగతా పిల్లల లోకం నుంచి వారిని వేరుచేసి పరిమితమైన పరిసరాలను కల్పించడం కాకుండా అందరి పిల్లలతో కలిసి నేర్చుకునేందుకు, సాంఘీకీకరణ చెందుటకు, సమాజంలో సులభంగా సర్దుబాటుఅగుటకు వీలుగా సమ్మిళిత విద్యను అందించే పాఠశాలలుంటాయి. సమాజంలోని భౌతిక, మానవ వనరులన్నింటిని (తల్లిదండ్రులు, స్థానిక సమాజంలో ఉన్న నైపుణ్యంగల వ్యక్తులు, స్వచ్ఛంధ సంస్థలు మొదలగునవి) పాఠశాలలో భాగస్వామ్యంచేసి ఇటు పాఠశాలలో అభ్యసనాన్ని, అటు సమాజ సుస్థిర అభివృద్ధిని సాధింపచేసేదే సమ్మిళిత విద్య. సాధారణ విద్యార్థులు, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులనికాక ప్రతి విద్యార్థి అవసరాలు వేరువేరుగా ఉంటాయి. కావున విద్యార్థులందరి అవసరాలను తీర్చేవిధంగా పాఠశాలలను అభివృద్ధిచేయాలి. ఇదే సమ్మిళిత విద్య లక్ష్యం.

## సమ్మిళిత విద్యాభావన

సమ్మిళిత విద్యాభావనలో కాలానుగుణంగా అనేక మార్పులు వచ్చినవి. ఈ మార్పులను వివిధ నమూనాలలో పేర్కొన్నారు. ఆ నమూనాలు :

### 1) సాంప్రదాయ నమూనా ఆలోచన (Traditional Model)

వైకల్యం కలిగిన సంతానాన్ని పొందడం పూర్వజన్మ పాపఫలితంగా తల్లిదండ్రులు, సమాజం భావించేవారు. తల్లిదండ్రులు ఈ పరిస్థితిని అవమానంగా భావించి వారంతట వారే సమాజం నుంచి దూరం అయ్యేవారు, పిల్లలను దూరంచేసేవారు. తద్వారా ఆ పిల్లలు విద్యకు పూర్తిగా దూరంకావడం జరిగింది. అంటే మూఢనమ్మకం కారణంగా పిల్లల విద్య, వైద్యాల గురించి పట్టించుకోకపోవడమేకాక కుటుంబం మొత్తం అపరాధభావంతో సమాజం నుంచి దూరమయ్యేవారు.

### 2) మెడికల్ నమూనా-1 (Medical Model-1)

వైకల్యం కలిగిన పిల్లలు ఏమి చేయలేరో దానిపై దృష్టి కేంద్రీకరించి అవసరమైన వైద్య సౌకర్యం కల్పించి, వారి విద్యకు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటుచేయడం జరిగింది.

### 3) మెడికల్ నమూనా-2 (Medical Model-2)

ప్రత్యేక అవసరాలుగ పిల్లలకు ప్రత్యేక పాఠశాలల స్థానంలో నియత పాఠశాలలోనే 'సమైక్య విద్య'ను (Integrated Education) అందించడం జరిగింది. ఉదాహరణకు అంధులను ప్రత్యేక పాఠశాలలోకాక సాధారణ పాఠశాలలో ఇతర విద్యార్థులతోనే కలిపి విద్యను అందించుట. దీనికి వనరుల గదిని, అలాగే ప్రత్యేక ఉపాధ్యాయుడిని ఇవ్వడంతోపాటు ఆ పాఠశాలలో పనిచేసే ఇతర ఉపాధ్యాయులకు కూడ శిక్షణను ఇచ్చేవారు.

4) సాంఘీక నమూనా (Social Model)

ప్రతి విద్యార్థి అభ్యసనానికి ఉన్న అవరోధాలను గుర్తించి, వాటి పరిష్కారానికి అందరూ (పిల్లలు, ప్రభుత్వం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం) కృషి చేయాలి.

సాంఘీక నమూనాలో ముఖ్యమైనటువంటిది విద్యార్థులు విద్యావ్యవస్థకు సర్దుబాటు అయ్యే బదులు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను ఏర్పాటుచేసుకోవడం. అలా ఏర్పాటు చేసుకోకపోతే కొంతమంది విద్యార్థులు విద్యావ్యవస్థకు సర్దుబాటు కాలేక విద్యకు దూరమవుతారు.

5) సల్మాన్కా చర్యా చట్రం (Salamanca frame work for action)

సల్మాన్కా చర్యా చట్రం ప్రకారం సమ్మిళిత పాఠశాలంటే అందరు పిల్లలు, వారికి ఎలాంటి ఇబ్బందులు లేదా భేదాలున్నప్పటికి సాధ్యమైనంతవరకు వారంతా కలిసి అభ్యసించడం జరుగుతుంది. సమ్మిళిత పాఠశాలలు విద్యార్థుల విభిన్న అవసరాలను గుర్తించి ప్రతిస్పందించాలి. పిల్లలు భిన్న అభ్యసనా శైలులకు, వేగాలకు అనుగుణంగా పాఠశాలలు ఉండాలి. అందరికి గుణాత్మకవిద్యను అందించుటకు సరియైన పాఠ్యప్రణాళిక, వ్యవస్థాగత ఏర్పాట్లు, బోధనావ్యూహాలు, వనరుల ఉపయోగంతోపాటు సమాజ భాగస్వామ్యం ఉండాలి. ప్రతి పాఠశాలలో ప్రత్యేక అవసరాలను తీర్చుటకుగాను నిరంతర సేవలుండాలి.

6) యునెస్కో నమూనా (UNESCO Model)

'సమ్మిళిత విద్య' అంటే అభ్యసన, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలలో అందరి అభ్యాసకుల భాగస్వామ్యాన్ని పెంచుతూ వారి విభిన్న అవసరాలను తీర్చుతూ వారు తరగతిగది ప్రక్రియలకు, విద్యకు దూరం కాకుండా చూసే నిరంతర ప్రక్రియ.

7) సి.యస్.ఐ.ఇ. నమూనా (CSIE – Centre for studies on Inclusive Education)

''సమ్మిళిత విద్య'' కేవలం నిర్దిష్ట సమూహానికి చెందిన పిల్లల విద్యకు మాత్రమే పరిమితం కాదు. ఇది అందరి అభ్యసనను, భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది. అందరూ అంటే పాలకులు, పిల్లలు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది, సమాజం. ఇక్కడ సమ్మిళిత విద్య భావన ఒక విస్తృత అర్థంలో వాడబడింది. పాఠశాల ఉండే ఆవాసంలోని పిల్లలతో పాటు ప్రతి ఒక్కరి అభ్యసన అవసరాలను తీర్చాలని తెలుపుతుంది.

పైన పేర్కొన్న నమూనాలను పరిశీలిస్తే సమ్మిళితవిద్య అనేది ఆరంభంలో అంగవైకల్యం కలిగిన పిల్లలకు విద్యను అందించే అంశంగా మాత్రమే ఉన్నది. అంగవైకల్యం కలిగిన పిల్లలకు, విద్యను ప్రత్యేక పాఠశాల ద్వారా అందించారు. ఈ విధానంలో అంగవైకల్యం కలిగిన పిల్లలు, ఇతర సాధారణ విద్యార్థులతో కలిసే అవకాశం లేనందున ఇతర విద్యార్థులతో కలిసి విద్యనభ్యసించే అవకాశమున్న సమైక్య పాఠశాలల ద్వారా విద్యను అందించారు. ఈ పద్ధతిలో, ఒకే రకమైన అంగవైకల్యం కలిగిన పిల్లలను సాధారణ పాఠశాలలోని ఇతర

విద్యార్థులతో కలిపి విద్యను అందిస్తారు. ఉదాహరణకు అంధులను, ఇతర సాధారణ విద్యార్థులతో కలిపి విద్యనందించే విధానాన్నే సమైక్య విద్య అంటారు. ఇలాంటి పాఠశాలలో అంధుల కొరకు వినియోగించే బోధనాభ్యసన సామాగ్రితో వనరులగది ఉంటుంది. అలాగే ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుడు ఉంటాడు. నేడు సమ్మిళిత విద్య అనేది కేవలం వైకల్యం కలిగిన పిల్లలకు ఇతర సాధారణ విద్యార్థులతో కలిపి విద్యనందించేది మాత్రమేకాదు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులని కాక ప్రతి ఒక విద్యార్థి అభ్యసనానికి ఉన్న అవరోధాలను గుర్తించి వాటిని పరిష్కరించి వారు తరగతి గది బోధనాభ్యసన ప్రక్రియకు అలాగే బడికి దూరం కాకుండా చూసే ఒక నిరంతర ప్రక్రియ.

సి.యస్.ఐ.ఇ. నమూనా సమ్మిళిత విద్యాపరిధిని పెంచింది. దీని ప్రకారం సమ్మిళిత విద్య కేవలం నిర్దిష్టమైన వయస్సుకలిగిన పిల్లల సమూహానికి చెందిన విద్యనేకాక పాఠశాల ఆవాసంలోని ప్రతి ఒక్కరి అభ్యసనావసరాన్ని తీర్చేదని తెలుపుతుంది. ఇటీవలికాలంలో మహారాష్ట్రకు చెందిన ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రంజిత్‌సింగ్ దిసాల్ గ్లోబల్ టీచర్ ప్రైజ్-2020ని గెలుపొందారు. ఇతడు పాఠ్యపుస్తకాలకు ఉపయోగించిన 'QR' కోడ్‌తోపాటు బాలికలవిద్యకు పాటుపడినందుకుగాను ఈ గౌరవం దక్కింది. ఈ పాఠశాల ఆవాసంలో నివసించే తల్లిదండ్రులు బాలికలవిద్య పట్ల సుముఖంగా లేరని ఇతడు గ్రహించినాడు. బాలికలవిద్య ఆవశ్యకతను ఆ తల్లిదండ్రులు గుర్తించేటట్టు చేయుటకుగాను వారు మాట్లాడే భాషను నేర్చుకొని, వారు పనిచేసే వ్యవసాయక్షేత్రాలకు వెళ్ళి వారితో చర్చించి వారు బాలికలను పాఠశాలకు పంపుటకు ఒప్పించినాడు. తద్వారా ఆ గ్రామములో బాలికలందరూ పాఠశాలలో చేరునట్లు చేసినారు. అలాగే ఈ ఉపాధ్యాయుడు ఆ గిరిజన సంస్కృతిలో భాగమైన బాల్యవివాహాలవల్ల కలిగే నష్టాలను వివరించి, వారు ఆ బాల్యవివాహాలకు స్వస్తిపలికేటట్లు చేసినారు. ఇవి సి.యస్.ఐ.ఇ. నమూనా తెలిపిన సమ్మిళితవిద్య కేవలం నిర్దిష్ఠ సమూహానికి చెందిన పిల్లల విద్యకే కాదని ఇది అందరి అభ్యసన అవసరాలను తీర్చేదనే దానికి ఒక చక్కటి తార్కాణం.

కొఠారి కమిషన్ (1964-66) సూచించిన సామాన్య పాఠశాల వ్యవస్థ (Common School System) గురించి తెలిపిన దానిని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ''అన్ని సామాజిక వర్గాలు, సమూహాలను ఏకతాటిపైకి తెచ్చి సమసమాజాన్ని, సమైక్య సమాజాన్ని నిర్మించడం విద్యావ్యవస్థ ధ్యేయం కావాలి''. అంటే ఒక ఆవాసంలో నివసించే పిల్లలంతా ఆ ఆవాసంలో ఉన్న బడిలోనే చదవాలి. కొఠారి కమిషన్ సూచించిన 'సామాన్య పాఠశాల వ్యవస్థ', 'సమ్మిళిత విద్య' రెండు దాదాపు ఒకే భావనను వ్యక్తపరచుచున్నవి. సామాన్య పాఠశాలల వలన సమాజంలో కలిసిమెలిసి జీవించే ''జీవన నైపుణ్యానికి'' పునాది ఏర్పడుతుంది.

కొఠారి కమిషనే కాక వైకల్యం గల వ్యక్తుల హక్కు చట్టం-2016 ప్రకారం 6 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సున్న వైకల్యంగల పిల్లలు నేడు సమ్మిళిత విద్యను హక్కుగా పొందేవీలున్నది. అంటే ప్రభుత్వం నేడు సమ్మిళితవిద్యను ఉదారంగాకాక బాధ్యతగా అందించవలసిఉంది. అందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల స్థాయిలో ఈ దిశలో తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

## సమ్మిళిత విద్య – ఆవశ్యకత :

పాఠశాల అనేది సమాజం యొక్క సూక్ష్మరూపం. అంటే సమాజంలో ఎలాగైతే వివిధ భాషలు, మతాలు, కులాలు, సంస్కృతులు, సాంఘీక అంతస్తులు, వైకల్యాలుంటాయో తరగతి గదిలో కూడ అన్ని రకాల పిల్లలు ఉంటారు. వీరందరి అవసరాలను గుర్తించి ప్రతిస్పందించే విధంగా సమ్మిళిత పాఠశాలలు ఉంటాయి. విద్యార్థుల అభ్యసన అనేది కేవలం విద్యార్థులు, ఉపాధ్యాయులపైననే కాక వారి తల్లిదండ్రులు, సమాజసభ్యులపై కూడ ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ముఖ్యంగా బాలికలు విద్యను కొనసాగించడమనేది వారిపైననేకాక వారి తల్లిదండ్రులపై కూడ ఆధారపడి ఉంటుంది. తల్లిదండ్రులు, బాలికలు చదివి ఉద్యోగం చేసేదేమి లేదనే భావనతో వారి చదువుపట్ల ప్రతికూల వైఖరితో ఉన్నట్లయితే ఆ బాలికలు చదువును మధ్యలోనే మానేయవలసి వస్తది. అంటే ఇచ్చట పిల్లలు విద్యను అభ్యసించడమనేది కేవలం పిల్లలకు సంబంధించిన అంశం మాత్రమేకాక వారి తల్లిదండ్రులకు సంబంధించిన విషయంగా పరిగణించవలసి ఉంటుంది. ఇటువంటి సందర్భంలో పిల్లల అభ్యసనకు ఆటంకంగా ఉన్న తల్లిదండ్రుల ప్రతికూలవైఖరిపై ఉపాధ్యాయులు దృష్టిసారించవలసి ఉంటుంది. సమ్మిళితవిద్య అనేది కేవలం నిర్ధిష్ఠ సమూహానికి చెందిన పిల్లల విద్యకు మాత్రమే పరిమితం కాక, ఆవాసంలోని ప్రతి ఒక్కరి అభ్యసన అవసరాన్ని తీరుస్తుంది. ఉదాహరణ : ఆవాసంలో నివసించే వారికి మూఢనమ్మకాలు ఉంటే, వారి మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలను వివరించి శాస్త్రీయదృక్పధాన్ని కలిగించడం, పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారం, సమతుల ఆహారం ప్రాధాన్యతను తెలపడం, ప్లాస్టిక్ ఉపయోగంలో కలిగే నష్టాలను తెలుసుకునేటట్లు చేయడం మొదలగు అవసరాలను తీర్చడం జరుగుతుంది. కాబట్టి మొత్తం సమాజం 'జ్ఞానసమాజం'గా అభివృద్ధి చెందుటకు తోడ్పడుతుంది. సమ్మిళిత పాఠశాలలో భిన్న నేపధ్యాలున్న పిల్లలంతా కలిసిమెలిసి విద్యనభ్యసించుట వలన విద్యార్థులలో సహనం, సహానుభూతి, మతసామరస్యం మొదలగునవి యాధృచ్ఛికంగానే అభివృద్ధి చెందుతాయి. అంతేకాకుండా రాజ్యాంగ విలువలైనట్టి ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద విలువలు కూడ పెంపొందిచబడతాయి. అందువలన బడిలోని పిల్లలందరి అవసరాలు తీర్చేవిధంగా ప్రతి పాఠశాలను సమ్మిళిత పాఠశాలగా అభివృద్ధిచేసి విద్యను అందించాలి. ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటుచేసి విద్యను అందించవచ్చుగాని వారు జీవించడానికి ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించలేము కదా! ప్రత్యేక అవసరాలున్న పిల్లలు కూడ అందరితో కలిసిమెలిసి ఇదే సమాజంలో జీవించాలి కాబట్టి అందరి అభ్యసన అవసరాలను తీర్చే "సమ్మిళిత విద్యనే" ఏ దేశానికైన అత్యంత ఆవశ్యకమైనది. వైకల్యంగల వ్యక్తుల చట్టం-2016 ప్రకారం వైకల్యంగల పిల్లలు సమ్మిళిత విద్య కాక రకరకాల పాఠశాలలలో విద్యను అందిస్తే, కొఠారి కమిషన్ సూచించినట్లు సమాజంలోని వివిధ వర్గాలను ఏకతాటిపైకి తెచ్చి సమసమాజాన్ని స్థాపించే బదులుగా సమాజంలో అప్పటికే ఉన్న సామాజిక వర్గాల మధ్య వైషమ్యాలు పెరిగి సమాజ ఐక్యతకు విఘాతం ఏర్పడుతుంది.

### కృత్యాలు :

1) సమ్మిళితవిద్య అంటే మీకు ఏమి అవగాహన అయినదో వివరించండి.

2) సి.యస్.ఐ.ఇ. నమూనా దృష్ట్యా భారత దేశంలో సమ్మిళిత విద్య ఆవశ్యకతను తెలుపుము.

3) సమ్మిళిత విద్య అమలు జరగకపోతే సమాజంలో ఏర్పడే పర్యావసానాలను తెలుపుము.

## ముగింపు

'అందరు చదవాలి, అందరు ఎదగాలి' అనే లక్ష్యాన్ని సాధించుటకు విద్యార్థుల భాషలు, సంస్కృతులు, అలవాట్లు, అంతస్తులు, కులాలు మొదలగునవి వేరువేరుగా ఉన్నప్పటికి అందరి అభ్యసన అవసరాలను తీర్చేవిధంగా పాఠశాలలలో భౌతిక వనరులను కల్పించడం, విద్యార్థులకు అనువుగా సరళమైన పాఠ్యప్రణాళికలను, సరియగు బోధనాభ్యసన ప్రక్రియలను, సమాజ భాగస్వామ్యము కల్పించే విద్యనే ''సమ్మిళిత విద్య''. సమ్మిళిత విద్య ప్రతి విద్యార్థి అభ్యసనానికి ఉన్న అవరోధాలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషిచేస్తుంది. అంటే విద్యార్థులు విద్యా వ్యవస్థకు సర్దుబాటు అయ్యే బదులు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను ఏర్పాటుచేసుకోవడం. ఇలా ఏర్పాటుచేసుకోకపోతే కొంతమంది విద్యార్థులు విద్యావ్యవస్థకు సర్దుబాటుకాలేక విద్యకు దూరమవుతారు. సమ్మిళిత పాఠశాలలు విద్యార్థుల విభిన్న అవసరాలను గుర్తించి ప్రతిస్పందించాల్సి ఉంటుంది. పిల్లల భిన్న అభ్యసన శైలులకు, వేగాలకు అనుగుణంగా పాఠశాలలను తీర్చిదిద్దాలి. సమ్మిళిత విద్య పాఠశాల ఉండే ఆవాసంలోని నిర్దిష్ట సమూహానికి చెందిన పిల్లల విద్యకు మాత్రమే పరిమితం కాక, పిల్లలతోపాటు సమాజ సభ్యుల అభ్యసన అవసరాలను తీర్చాలని తెలుపుతుంది.

## యూనిట్–2 : సమ్మిళిత విద్య – సవాళ్ళు మరియు వ్యూహాలు

**లక్ష్యాలు : దీనిని చదివిన తరువాత**

1) సమ్మిళిత విద్య అమలులో ఎదురగు సవాళ్ళను గుర్తిస్తారు.

2) సమ్మిళిత విద్య సవాళ్ళను అధిగమించుటకు దోహదపడే వ్యూహాలను అవగాహన చేసుకొని, పరిస్థితులకు అనుగుణంగా వాటిని అమలుపరచగలుగుతారు.

3) సమ్మిళిత విద్యను, అమలుపరచుటలో పాఠశాల నాయకత్వం పాత్రను అవగాహన చేసుకొని తదనుగుణంగా నడుచుకుంటారు.

**కీలక / ముఖ్య పదాలు**

1) విద్యాప్రణాళిక

2) సమ్మిళిత విద్యాసవాళ్ళు

3) బోధనాభ్యసన మెలకులు

4) పాఠశాల నాయకత్వం

5) సవాళ్ళనధిగమించే వ్యూహాలు

## పరిచయం

సమ్మిళిత విద్యాపాఠశాలలో భిన్న నేపథ్యాలు గల పిల్లలు ఉంటారు. వీరందరి అవసరాలను తీర్చే క్రమంలో ఎదురయ్యే సవాళ్ళను విద్యాక్షేత్రంలో వున్న మనం గుర్తించి పరిష్కరించుకొనేందుకు కావల్సిన ప్రణాళికను అలాగే

వనరులను సమకూర్చుకోవాలి. పాఠశాలలలో సౌకర్యాల కొరత, సరళత లోపించిన పాఠ్యప్రణాళిక / విద్యాప్రణాళిక, మానవ వనరుల కొరత, సమ్మిళిత విద్యపట్ల తల్లిదండ్రుల అననుకూల వైఖరి మొదలగు సవాళ్ళు నేడు ఎదురగుచున్నవి. సమాజము స్తబ్దంగా కాక గతిశీలకంగా ఉంటుంది. కావున పిల్లలందరి అవసరాలను తీర్చుటలో కొత్త కొత్త సవాళ్ళు కూడ ఎదురవుతాయి. ప్రపంచీకరణ, పట్టణీకరణ నేపథ్యంలో మనం ఊహించనటువంటి సవాళ్ళు కూడ ఎదురుకావచ్చును. ఉదాహరణకు మారుమూల ఉన్న ఒక గిరిజన తండా నుండి ఉపాధి కొరకు పట్టణానికి వలసవచ్చిన వారి పిల్లలు పట్టణంలోని పాఠశాలలో చేరినప్పుడు వారి భాష, సంస్కృతి పట్టణ సంస్కృతి మధ్యన చాలా వ్యత్యాసం ఉండుట వలన ఆ పిల్లలు పాఠశాలకు సర్దుబాటు కావడం అలాగే బోధనాభ్యసన ప్రక్రియలో పాల్గొనడం ఒక సవాలు. అలాగే పొరుగు దేశానికి చెందినవారు ఉద్యోగరీత్యా మనదేశంలో పనిచేయుటకు వచ్చిన వారి పిల్లలు మన పాఠశాలలో చేరినప్పుడు వారు మాట్లాడే భాష, వారి సంస్కృతి పాఠశాల భాషకు, సంస్కృతికి సరిపోకపోవచ్చు. ఇలాంటి పిల్లల బోధనాభ్యసనకై వినియోగించే కృత్యాలు, ప్రాజెక్టులు, బోధనాపద్ధతి, బోధనాసామాగ్రి, ఉపయోగించే భాష వారికి సరిపోయే విధంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. భిన్న అనుభవాలు వున్న విద్యార్థులు, వారి అనుభవాలను ఇతర విద్యార్థులతో పంచుకుంటే వారి అనుభవాలు కూడ విస్తృతమవుతాయి. అందుకే భిన్న నేపథ్యాలున్న విద్యార్థుల అనుభవాలు అభ్యసనకు ప్రతిబంధకాలుగా కాక అవి వనరులుగా ఉపయోగపడతాయనే విషయాన్ని గమనంలో వుంచుకోవాలి. ఇవి వినూత్న ఆలోచనలకు ఆస్కారం కల్పిస్తాయి. సవాళ్ళను ఎదుర్కొనుటలో కీలకపాత్ర పోషించవలసినది ముఖ్యంగా పాఠశాల నాయకత్వం. ఇది గతిశీలకంగా ఉండి సవాళ్ళను స్వీకరిస్తే ఆశించిన ఫలితాలను సాధించవచ్చు.

## సమ్మిళిత విద్య – సవాళ్ళు

పాఠశాల, ఆవాసంలోని ప్రతి ఒక్కరి అభ్యసనావసరాలను తీర్చడమే సమ్మిళిత విద్య లక్ష్యం. అభ్యసనావసరాలను తీర్చుటలో ఎదురగు ఆటంకాలే సవాళ్ళు. ఇవి అన్ని పాఠశాలలలో ఒకే విధంగా ఉండవు. ఆయా పాఠశాలలు ఉన్న ఆవాస పరిస్థితులను బట్టి రకరకాల సవాళ్ళు ఎదురయ్యే అవకాశం ఉన్నది. ప్రతి పాఠశాలకు ఎదురుకాబోయే సవాళ్ళను మొదటనే పసిగట్టాలి, లేదంటే కనీసం ఎదురయిన సవాళ్ళను వీలయినంత త్వరగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్ళితేనే సమ్మిళితవిద్యను విజయవంతంగా అమలుచేయగులుగుతాము. సాధారణంగా ఎదురగు కొన్ని సవాళ్ళను తెలుసుకుందాం.

1) **సౌకర్యాల కల్పన :** పిల్లలంతా పాఠశాలకు వచ్చుటకు వీలుగా పాఠశాల భవనంలో సౌకర్యాలను కల్పించుట ఒక సవాలు. ముఖ్యంగా అంగవైకల్యం కలిగిన పిల్లలకు అనుకూలంగా ఉండే ర్యాంపులు, టాయిలెట్లు (Toilets), ఆటవస్తువులు, బోధనాభ్యసనసామాగ్రి మొదలగునవి ప్రతి పాఠశాలలో ఏర్పాటుచేసుకోవాలి. ఇలాంటి సౌకర్యాలను ఏర్పాటుచేసుకొనుటకు పాఠశాల యాజమాన్య కమిటీ మరీ ముఖ్యంగా ప్రధానోపాధ్యాయుడు చొరవ చూపించి స్థానిక సమాజాన్ని, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలి. కార్పొరేటు సామాజిక బాధ్యత క్రింద పాఠశాలలను దత్తత తీసుకునే విధంగా కూడా ప్రయత్నించవచ్చును.

2) **బోధనాభాష** : విద్యార్థుల మాతృభాష, పాఠశాల బోధనాభాష వేరువేరుగా ఉన్నప్పుడు మాతృభాష ప్రభావంచేత వారు పాఠశాల బోధనాభాషను సరిగ్గా ఉచ్ఛరించలేకపోవడం, అలాగే రాయడంలో కొంత ఇబ్బందిని పడుతుండవచ్చును. ఉపాధ్యాయులు ఇలాంటి వారిని నిర్లక్ష్యం చేస్తే తోటి విద్యార్థులు కూడా వారిని చిన్నచూపు చూసే అవకాశం ఉన్నది. వీరు భాష నేర్చుకోవడంలో వెనుకబడే అవకాశం ఉన్నది. అలాంటప్పుడు ఉపాధ్యాయులు, విద్యార్థుల మాతృభాషకు తగిన ప్రాధాన్యతను, గౌరవాన్ని ఇస్తూ క్రమంగా పాఠశాల బోధనాభాషను నేర్చుకునేటట్లు ఒక వారధిగా ఉపాధ్యాయుడు వ్యవహరించాలి.

3) **పాఠ్యప్రణాళిక** : విద్యార్థుల శక్తిసామర్థ్యాలు, ఆసక్తులమేరకు వారికి ఇష్టమైన సబ్జెక్టులను, అలాగే ఆటలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఎన్నుకొనుటకు వీలులేకుండ అందరు విద్యార్థులు ఒకే రకమైన పాఠ్యప్రణాళికను అభ్యసించాలనడం ఒక పెద్ద సవాలే.

4) **బోధనాభ్యసన మెలకువలు** : ఉపాధ్యాయులు సాంప్రదాయ బోధనాభ్యసన మెలకువలనే నేటికి వినియోగించడంకాక కాలానుగుణంగా వచ్చే మార్పులను అలాగే ఆ పాఠశాల పిల్లలకు ఏ పద్ధతులు సరిపోతాయో వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉపయోగించాలి. సాంప్రదాయ పద్ధతులైన ఉపన్యాస, ప్రదర్శనా, ఆగమన, నిగమన పద్ధతులకే పరిమితంకాక సహకార, సహచర్య, ప్రయోగ మొదలగు పద్ధతులను ఉపయోగించడంతోపాటు చర్యాత్మక పరిశోధనలను చేపట్టి నూతన మెలకువలను ఆవిష్కరించుకోవాలి. ముఖ్యంగా సమ్మిళిత విద్యావిధానంలో తరగతి గదిలో వివిధ నేపథ్యాలు, వైకల్యాలు గలిగిన విద్యార్థులుండే అవకాశం ఉన్నది. ఉదాహరణకు వివిధ భాషలు మాట్లాడేవారు, వివిధ సంస్కృతులకు చెందినవారు అలాగే వివిధ వైకల్యాలుగల పిల్లలు ఉండవచ్చును. ఇలాంటి వారికి బోధించేటప్పుడు కేవలం ఏదో ఒక పద్ధతిన తరగతి మొత్తానికి బోధనచేస్తే అది అందరికి ఉపయోగంగా ఉండదు. ఈ పరిస్థితులలో వైయక్తిక బోధనాభ్యసన కార్యక్రమాన్ని నిర్వహించవలసి ఉంటుంది. తరగతిలో వివిధ భాషలు మాట్లాడేవారు ఉన్నప్పుడు ఏదో ఒక భాషనే ఉపయోగించడం కాక వీలైనంత వరకు వివిధ భాషలను ఉపయోగించాలి. అలాగే ఏ ఒక్క భాషను చులకనగా చూడరాదు.

5) **విద్యాసాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించడం** : విద్యాసాంకేతిక శాస్త్రంలో వచ్చే అనేక మార్పులను వెంటవెంటనే తెలుసుకొని వాటిని ఉపాధ్యాయులు ఉపయోగించాలి. ఇలా చేయకపోతే విద్యార్థులు వాటిని ఉపయోగిస్తూ ముందుకు వెళ్తునప్పుడు ఉపాధ్యాయులు వెనుకపడతారు.

6) **విద్యార్థుల విద్యాప్రగతి** : విద్యార్థులు తక్కువ స్థాయి ప్రగతి కనబరచినప్పుడు, ఉపాధ్యాయులు దానికిగల కారణాలను తెలుసుకొని వారి అభ్యసన మెరుగుకై చర్యలు చేపట్టకపోవడంవలన వారు నిరుత్సాహపడటం ఒక సవాలు.

7) **వివక్ష** : కులం, మతం, లింగం, భాష, వైకల్యం తదితర వాటికి అతీతంగా అందరికి పాఠశాలలలో ప్రవేశాలు కల్పించినప్పటికి, అప్రయత్నంగానో, ఉద్దేశపూర్వకంగానో మనదేశ పాఠశాలలలో నేటికి పిల్లలపట్ల వివక్ష కొనసాగుతుంది. ఉదాహరణకు బాలికలకు ''చదువెందుకని, చదివి ఏమి ఉద్ధరిస్తారని'' ఒకవైపు తల్లిదండ్రులు, సమాజసభ్యులు మరొకవైపు ఉపాధ్యాయులు కూడ ఉదాసీనతను చూపిస్తున్నారు. బాలికల విద్యపట్ల ఇలా ప్రతికూలవైఖరి కలిగి ఉండడమనేది ఒక సవాలే. ఇలాంటి వివక్షపూరిత మరెన్నో సవాళ్ళు మన పాఠశాలలలో ఉన్నాయి.

8) **తల్లిదండ్రులు, స్థానికుల భాగస్వామ్యం** : తల్లిదండ్రులు వారి పిల్లల చదువుపట్ల ఏ మాత్రం శ్రద్ధ కనబరచకపోవడం ఒక సవాలే. ఇలాంటి తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలో చేర్చరు లేదా చేర్చినప్పటికి బడికి క్రమం తప్పకుండా పంపరు. అలాగే ఇంటివద్ద చదవకపోయినా ఏమి పట్టించుకోరు. తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సంఘ సమావేశాలలో తల్లిదండ్రులు పాల్గొనకపోవడం, అలాగే పాఠశాల కార్యక్రమాలలో ముఖ్యంగా విద్యాపర విషయాలలో తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొనకపోవడం కూడ ఒక సవాలే.

## సమ్మిళిత విద్య – వ్యూహాలు

సమ్మిళిత విద్య సవాళ్ళు రకరకాలుగా ఉంటాయి. కావున వీటిని అధిగమించుటకు వివిధ వ్యూహాలను అమలుపరచవలసి ఉంటుంది. సవాళ్ళను అధిగమించుటకు ఉపయోగపడే కొన్ని వ్యూహాలు.

1) **ఉపాధ్యాయు-స్వీయ పరీక్ష (Self check)** : పాఠశాలలో పనిచేయు ప్రధానోపాధ్యాయుడితోపాటు అందరు ఉపాధ్యాయులు వారి వారి ప్రవర్తనలు, చేపట్టే కార్యక్రమాలు అందరి విద్యార్థులలో అలాగే వారి తల్లిదండ్రులలో ఉత్సాహాన్ని, ప్రేరణను, ఆసక్తిని పెంపొందించే విధంగా ఉన్నాయా లేదా అని స్వీయపరీక్ష లేదా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకవేళ మనం వారిలో ఉత్సాహాన్ని, ఆసక్తిని పెంపొందిచలేకపోతున్నామంటే మనం ఏ విషయంపైనైనా నిర్లక్ష్యం చూపుతున్నామా లేదా మరెక్కడనయినా పొరపాటుచేస్తున్నామా అని తెలుసుకొని సవరించుకోవాలి.

2) **భాగస్వామ్యాన్ని పెంచుట** : సమ్మిళిత విద్య సాఫల్యం చెందాలంటే పాఠశాల కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. పాఠశాల కార్యక్రమాలను రూపొందించడం నుంచి మొదలుకొని వాటిని అమలుపరుచుట వరకు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటి, స్థానిక ప్రజాప్రతినిధులు మొదలగువారు భాగస్వాములు అయ్యేలా చూడాలి. ప్రధానోపాధ్యాయుడో, ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు మాత్రమే కార్యక్రమాలను రూపొందించి తల్లిదండ్రులను, ప్రజలను ఆచరణలో భాగస్వాములను కమ్మంటే ఫలితాలు ఆశించిన మేరకు ఉండవు. పిల్లల తల్లిదండ్రులు నిరక్షరాస్యులనో, మరొక కారణం చేతనో వారిని నిర్లక్ష్యం చేయరాదు. ఉపాధ్యాయులు నిరంతరం పిల్లల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించిగాని, చర్చాగోష్ఠుల ద్వారా కాని పిల్లల ప్రవర్తనకు మరియు విద్యకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ వారు విద్యాకార్యక్రమాలను రూపకల్పనచేసే ప్రక్రియలో అలాగే వాటిలో పాల్గొనే విధంగా చేయాలి.

3) **సరళ విద్యాప్రణాళిక** : అభ్యాసకుల స్థాయి, ఆసక్తులకు అనుగుణంగా విషయాన్ని, బోధనావ్యూహాలను, బోధనాభ్యసన ప్రక్రియలను, బోధనాభ్యసన సామాగ్రిని, మూల్యాంకన పద్ధతులు అవసరం మేరకు మార్చుకునే అవకాశం ఉండాలి. ఉదాహరణకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలు, ఇతర సర్వేలు 5వ తరగతి చదివే విద్యార్థులకు రెండవ తరగతి పాఠ్యపుస్తకాలు చదవడం, రాయడం రావడంలేదని, అలాగే గణిత సంబంధమైన చతుర్విధ ప్రక్రియలు రావడంలేదని తెలుపుతున్నవి. అంటే తరగతికి తగిన అభ్యసన జరగడంలేదు. ప్రస్తుతం పాఠశాలలో 5వ తరగతి చదువుచున్న విద్యార్థులకు చదవడం, రాయడం రాకపోయినా వాటిని నేర్పకుండానే 5వ తరగతికి చెందిన పాఠ్యాంశాలు బోధిస్తున్నాం. అలాగే వాటిలోనే పరీక్షలను నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులు పాఠ్యప్రణాళికను, పాఠ్యాంశాలను విద్యార్థుల స్థాయికి అనుగుణంగా మార్చుకోకుండా యాంత్రికంగా అందరికీ ఒకే పాఠ్యప్రణాళికను అమలుపరచుట ఒక సవాలు. కొన్ని సందర్భాలలో విద్యార్థుల అభ్యసన గమనానికి అనుగుణంగా వారిని మదింపు చేయాలి. అందరితోపాటు గాకుండా మదింపు చేయడానికి వీరికి ప్రత్యేక సాధనాలు ఉపయోగించే వెసులుబాటు ఉండాలి.

4) **శిశుకేంద్రిత విద్య** : విద్యార్థుల జీవితాలను యాంత్రికంగా విద్యాకేంద్రకంగా తిప్పడం కాకుండా విద్యార్థుల నిజజీవిత వైవిధ్యతల ఆధారంగా వారి వారి జీవితాలను అనుభవించేటట్లు దానిలోని మాధుర్యాన్ని పొందేలా ఉండాలి. బాలబాలికల అనుభవాలకు, ఆవేదనలకు, వారి భాగస్వామ్య ప్రక్రియలకు ప్రాధాన్యతను ఇవ్వాలి. శిశుకేంద్రంగా ఉండే బోధనాభ్యసన పద్ధతులైన కృత్యాధార, ప్రాజెక్టు, సహకార, సమవయస్కుల, సహచర్య మొదలైన వాటిని వినియోగించాలి. ఉపాధ్యాయులు సాంప్రదాయ పద్ధతిగా తరగతిలో బాగా చదివేవారు, సగటుగా చదివేవారు, సగటు కంటే తక్కువగా చదివేవారుంటారని భావించి, సగటు వారిని దృష్టిలో ఉంచుకొని బోధిస్తే, అందరూ నేర్చుకుంటారని బోధించడంకాక ప్రతి విద్యార్థి ప్రత్యేకమని గుర్తించి వారు రాణించేందుకు తగిన విద్యాప్రణాళికను తయారుచేసుకొని అమలుపరచాలి. ముఖ్యంగా విద్యలో వెనుకబడిన వారికి విద్యాబోధన చేయునప్పుడు దానికిగల కారణాలను తెలుసుకొని వాటిని అధిగమించుటకు ఉపాధ్యాయులు వారికి తగిన సహాయాన్ని అందించి వారి విద్యాప్రగతి కూడా సంతృప్తికరంగా ఉండే విధంగా చూడాలి.

5) **ఆత్మవిశ్వాసాన్ని కల్పించుట** : ఉపాధ్యాయులు పిల్లల సామర్థ్యాలను, ఆసక్తులను గుర్తిస్తూ వాటిలో రాణించుటకు ప్రోత్సహించాలేగాని, వారి బలహీనతలను ఎత్తిచూపుతూ నిరాశపరచరాదు. పిల్లల బలాల ఆధారంగా కార్యక్రమాలను కల్పిస్తే బలహీనతలు క్రమేపితగ్గి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించబడుతుంది.

6) **విద్యార్థుల సామర్థ్యాలకు ప్రదర్శన అవకాశం కల్పించుట** : ప్రతి విద్యార్థిలోని సామర్థ్యాన్ని ఉపాధ్యాయుడు గుర్తించి దానిని ప్రదర్శించుటకు అవకాశం కల్పించి, దానిని ఉపాధ్యాయుడు అభినందిచడమేకాక తరగతిలోని విద్యార్థులందరూ కూడ దానిని గుర్తించి అభినందిచేటట్లు చేయాలి. దీని వలన పిల్లలు ఒకరినొకరు అభినందించుకొనుటేగాక ప్రతి విద్యార్థిలో ఏదో ఒక సామర్థ్యం ఉంటుందని గుర్తిస్తారు.

7) **ఉపాధ్యాయులు జట్టుగా పనిచేయుట** : ఉపాధ్యాయులు ఎవరికి వారుగా పనిచేయడం కాకుండా, డాక్టర్లు ఎలాగైతే రోగి అనారోగ్యం గురించి చర్చించి తగిన వైద్యం చేస్తారో అలాగే ఉపాధ్యాయులు కూడ విద్యార్థులకు విద్యను అందించుటకు ఒకరితోనొకరు చర్చించుకొని తగిన పద్ధతులను ఉపయోగించాలి.

ఉదాహరణ : 1. ఉపాధ్యాయులు ఎవరికి వారే విద్యార్థులకు ఇంటిపనిని ఇచ్చినట్లయితే ఒకేసారి అది ఎక్కువై విద్యార్థులకు సమయము సరిపోక ఒత్తిడికి గురికావచ్చును. అలాగే అప్పుడప్పుడు ఏ టీచర్ కూడా ఇంటిపని ఇవ్వకపోతే విద్యార్థులకు అసలు పనిలేకపోవచ్చును. అలాకాక అందరు ఉపాధ్యాయులు చర్చించుకొని ఒక పద్ధతి ప్రకారం ఇంటిపనిని ఇస్తే బాగుంటుంది.

2. ఒక విద్యార్థి చదవడం, రాయడంతో అవసరంలేని లెక్కలను బాగుగా చేస్తున్నాడు. రాత లెక్కలు సరిగా చేయడంలేదు. అలాంటి విద్యార్థికి బోధన చేయుటకు గణిత ఉపాధ్యాయుడు, భాషను బోధించే ఉపాధ్యాయుడితో కలిసి పనిచేయవలసి ఉంటుంది.

ఇక్కడ పేర్కొన్న వ్యూహాలేకాక ఇంకా చాలా వ్యూహాలుంటాయి. ఉపాధ్యాయులు వాటి గురించి తెలుసుకోవడంతోపాటు వారు కూడ నూతన వ్యూహాలను ఆవిష్కరించుకొని సందర్భానుసారం వినియోగించుకోవాలి.

## పాఠశాల నాయకత్వం – పాత్ర

సమ్మిళిత విద్యను అమలుపరచుటలో అనేక సవాళ్ళు ఎదురవుతాయని అలాగే వాటిని అధిగమించేందుకు కొన్ని వ్యూహాలను కూడ తెలుసుకున్నాం. ఈ సవాళ్ళు అన్ని పాఠశాలలలో ఒకేలా ఉండక పాఠశాలలో ఉన్న విద్యార్థుల పరిస్థితి అలాగే ఆయా పాఠశాలలున్న ఆవాసంలోని పరిస్థితులను బట్టి వేరువేరుగా ఉంటాయి. ఇలా వేరువేరుగా ఉన్న సవాళ్ళను ఎదుర్కొనుటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆదేశాలు, అమలుపరిచే పథకాలు మాత్రమే సరిపోవు. స్థానిక పాఠశాల నాయకత్వం మాత్రమే వారికి ఎదురయ్యే సవాళ్ళు ఏవి? దానికి గల కారణాలు ఏమిటని తెలుసుకొని ఆయా సవాళ్ళను ఎదుర్కొనగలుగుతారు. అందుకే పాఠశాల నాయకత్వం బలోపేతంగా ఉండాలి. సృజనాత్మకంగా పనిచేయాలి.

సవాళ్ళను అధిగమించుటకు ఉపాధ్యాయులు ఎవరికి తోచిన రీతిలో వారు ప్రయత్నించడమో లేదా ప్రధానోపాధ్యాయుడు ఏది చెపితే అది చేద్దామనే ఆలోచన కాకుండా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటి, స్థానిక ప్రముఖులు మొదలగు వారందరు కలిపి పాఠశాల

ప్రణాళికను, కార్యాచరణను తయారుచేసుకొని అమలుచేసుకోవాలి. ఇలా చేస్తే పాఠశాల కార్యక్రమాలలో అందరి భాగస్వామ్యాన్ని పెంచవచ్చు. పాఠశాల విజయాన్ని ప్రధానోపాధ్యాయుడి విజయంగా, వైఫల్యం చెందితే ఉపాధ్యాయుల వైఫల్యంగానో లేదా విజయాన్ని ఉపాధ్యాయుల విజయంగా వైఫల్యాన్ని ప్రధానోపాధ్యాయుడి వైఫల్యంగానో కాక విజయాలకు గాని వైఫల్యాలకు గాని అందరం బాధ్యులమే అనే భావనను పెంపొందించుకోవాలి. పాఠశాల నాయకత్వం ఉమ్మడిగా నిర్ణయాలను తీసుకొని వాటిని అమలుచేసుకుంటూ, సమీక్ష చేసుకుంటూ తదనుగుణంగా కార్యాచరణలో మార్పులను చేసుకుంటూ ముందుకు వెళితేనే సవాళ్ళను ఎదుర్కొనగలము. సమ్మిళిత పాఠశాలలకు ఎదురగు సమస్యలు, ఆయా పాఠశాలల ఆవాస పరిస్థితులు, వనరులు తదితర అంశాల ఆధారంగా వేరువేరుగా ఉంటాయని తెలుసుకున్నాం. ఉదాహరణకు ఒక ఆవాసంలోని తల్లిదండ్రులు పిల్లలను దండిస్తేనే భయంతో మంచిగా చదువుతారనే నమ్మకాన్ని కలిగి ఉన్నారు. వారికి దండన వలన కలిగే ప్రతికూల పర్యావసానాలు తెలియకపోవుటవలన అలాంటి నమ్మకాన్ని కలిగి ఉన్నారు. దండిస్తే పిల్లలు మొండికేస్తారని, చదువుపట్ల ఆసక్తి తగ్గుతుందని, తల్లిదండ్రులపట్ల ద్వేషభావం ఏర్పడుతుందనే విషయం వారికి తెలువనందువలన అలాంటి అభిప్రాయాన్ని కలిగి ఉంటారు. ఇలాంటి పరిస్థితులలో పాఠశాల యాజమాన్య కమిటి, ఉపాధ్యాయులు – తల్లిదండ్రులు కమిటీలో చర్చించటం ద్వారా అలాగే స్థానిక సమాజాన్ని చైతన్యపరచుటకు కావలసిన కార్యక్రమాలను చేపట్టాలి. ఇలాంటి అనేక సవాళ్ళను అధిగమించుటకు పాఠశాల నాయకత్వం గతిశీలకంగా పనిచేస్తేనే సమ్మిళిత విద్య సఫలం అవుతుంది.

### కృత్యాలు :

1) సమ్మిళిత విద్యా దృష్ట్యా మీ పాఠశాల ఎదుర్కొనే సవాళ్ళను తెలుపండి.

2) మీ పాఠశాల ఎదుర్కొనే సవాళ్ళకు మీరు ఎలాంటి వ్యూహాలను వినియోగించుకుంటారో తెలుపండి.

3) సమ్మిళిత విద్యకై మీ పాఠశాల నాయకత్వం చేపట్టే కార్యక్రమాలను తెలుపండి.

### ముగింపు

సమ్మిళి విద్యలో భిన్న నేపథ్యాలుగల పిల్లలు చదువుతుంటారు. భిన్న నేపథ్యాలుగల పిల్లల అవసరాలు వేరువేరుగా ఉంటాయి. వాటిని తీర్చుటలో పలు సవాళ్ళు ఎదురవుతుంటాయి. సౌకర్యాల కల్పన, బోధనా భాష, పిల్లల మాతృభాష వేరువేరుగా నుండుట, సరళత్వం లోపించిన పాఠ్యప్రణాళిక మొదలగునవి. ఈ సవాళ్ళు పాఠశాల, పాఠశాలకు వేరువేరుగా ఉంటాయి. పాఠశాల ఉండే ఆవాసంలోని ప్రజల జీవన విధానం, ఆర్థికస్థాయి, విద్యాస్థాయి, వనరుల అందుబాటు మొదలగువాటి ఆధారంగా పాఠశాలలు వివిధ సవాళ్ళను ఎదుర్కొంటాయి. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు, సూచనలు, సహకారం మాత్రమే వాటిని పరిష్కరించుకునేందుకు సరిపోవు. ఈ సవాళ్ళను ఎదుర్కొనేందుకు ప్రతీ పాఠశాల తనదైన పద్ధతిలో సన్నద్ధం కావలెను. ఎదురగు సవాళ్ళకు అనుగుణంగా వివిధ వ్యూహాలను రూపొందించుకొని సమస్యలను అధిగమించాలి. సమ్మిళిత విద్యను సఫలం చేయుటకు ఉపయోగపడే కొన్ని వ్యూహాలు : ఉపాధ్యాయుల స్వీయపరీక్ష; పాఠశాల కార్యక్రమాలలో భాగస్వామ్యాన్ని

పెంచుట; సరళ విద్యాప్రణాళికను రూపొందించుకొనుట; శిశుకేంద్రీకృత విద్య; ఉపాధ్యాయులు జట్టుగా పనిచేయుట మొదలగునవి. పాఠశాలలకు ఎదురగు సవాళ్ళను ఎదుర్కొనుటకు ఏఏ వ్యూహాలను ఎప్పుడు ఉపయోగించుకోవాలి అనేది ఆయా పాఠశాలల పరిస్థితులకు అనుగుణంగా పాఠశాల యాజమాన్య కమిటీలు మాత్రమే నిర్ణయం తీసుకోగలుగుతాయి. పాఠశాల నాయకత్వం సరైన పాత్రను నిర్వహిస్తేనే సమ్మిళిత విద్య విజయవంతం కాబడుతుంది.

పాఠశాలలో సమ్మిళిత విద్యను అమలుచేస్తున్న ప్రయత్నాన్ని ఈ అధ్యాయం చివరన అనుబంధంగా రెండు case studies పొందుపర్చడం జరిగింది. ఈ case studiesను అధ్యయనం చేసి, అదే స్ఫూర్తితో మీమీ పాఠశాలలో సమ్మిళిత విద్యను మీ అవసరాలకు, పరిస్థితులకు అనుకూలంగా అమలుచేయగలరని ఆశించడమైనది.

## మదింపు

1) సమ్మిళిత విద్య కేవలం నిర్దిష్ట సమూహానికి చెందిన పిల్లలకు అందించే విద్య మాత్రమే కాదని తెలిపినది. ( )

   1) మెడికల్ మోడల్-2
   2) యునెస్కో మోడల్
   3) సాంప్రదాయ నమూనా
   4) సి.యస్.ఐ.ఇ. నమూనా

2) సమ్మిళిత విద్య అమలులో ఏర్పడే సవాళ్ళు. ( )

   1) ప్రతీ పాఠశాలకు వేరు వేరుగా ఉంటాయి
   2) అన్ని పాఠశాలలకు ఒకే విధంగా ఉంటాయి
   3) రెసిడెన్షియల్ పాఠశాలలకు ఒకే విధంగా అలాగే ప్రభుత్వ పాఠశాలలకు ఒకేలా ఉంటాయి
   4) పై వేవీ కావు

3) బహు భాషలు మాట్లాడే విద్యార్థులున్న తరగతి గదిని ఇలా చూడాలి. ( )

   1) బోధనకు ఆటంకంగా
   2) భాషాభివృద్ధికి వనరుగా
   3) భాషాభివృద్ధికి ఆటంకంగా
   4) పైవేవీ కావు

4) వైకల్యం కలిగిన పిల్లలకు విద్యను ( )

1) ప్రత్యేక పాఠశాలలో అందించాలి

2) ఇంటివద్దనే అందించాలి

3) సమ్మిళిత పాఠశాలలో అందించాలి

4) సమైక్య పాఠశాలలో అందించాలి

5) సమ్మిళిత విద్య ప్రకారం ఈ క్రింది వారి అభ్యసనావసరాలను తీర్చాలి. ( )

1) పిల్లలవి మాత్రమే

2) తల్లిదండ్రులవి మాత్రమే

3) యువకులవి మాత్రమే

4) ఆవాసంలోని అందరివి.

## వనరులు (References) :


1) విద్య – లింగసమైక్యత, సమ్మిళిత దృక్పధాలు, డి.ఎల్.ఎడ్. రెండవ సంవత్సరం, తెలుగు అకాడమి, హైదరాబాద్.

2) Index for Inclusion, Centre for Studies on Inclusive Education (CSIE), Bristol, UK.


## అదనపు సంప్రదింపు గ్రంథాలు (Additional Readings) :


Inclusive Education for Children with Special Needs – Neena Dash – 2014 – Atlantic Publishers of Distributors (P) Ltd., New Delhi – 110002.

Annexure-1

# చదువుకి భాష అడ్డుకాదుగా...

**పాఠశాల ప్రధానోపాధ్యాయుని పేరు** : బి. శ్యామ్ చందర్ రావు

**పాఠశాల పేరు** : ఎమ్.పి.పి.ఎస్. మామిళ్ళగూడెం, ముల్కాలపల్లి (మం)

**జిల్లా** : భద్రాద్రి కొత్తగూడెం

**ఫోన్ నెంబర్** : 9949111876

**ఇ-మెయిల్ ఐడి** : mppsmamillagudem111@gmail.com


shyamrathod111876@gmail.com

**నేపథ్యం :** School Leadership for improving learning and learning out comes

ఛత్తీస్‌గఢ్ అడవులలో పోడు వ్యవసాయం చేస్తూ సంచార జీవనం సాగించే గొత్తికోయలు నీతికి, నిజాయితీకి మారుపేరు. వాగులు వంకలు దాటుకుంటూ అడవితల్లి ఒడిలో ప్రకృతితో సహజ జీవనానికి అలవాటుపడినవారు, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ రక్షణ దళాలు మరియు తీవ్రవాదుల మధ్య నలిగినవారు, శరీరంపై కౌపీనం మాత్రమే ధరించి కావడిలు మోస్తూ చీమలబారును తలపించేలా రోడ్లు ఎంత వెడల్పుగా ఉన్నా వారు ఒకే వరుసలో క్రమశిక్షణగా నడిచేవారు. అలాంటి గొత్తికోయలు కాలక్రమంగా కొంత చైతన్యం పొందుతూ, క్రమంగా అడవులు అంతరించడం, అడవుల్లో జీవనానికి కలుగుతున్న ఆటంకాలవల్ల అడవుల నుండి బయటకు వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటుచేసుకొని పోడు వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్నారు.


వీరిని అడవుల నుండి బయటకు రప్పించేందుకు వీరి జీవన విధానాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అనేక సంవత్సరాలుగా అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యం నుండి బయటకువచ్చి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కొత్తగా ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని గ్రామమే మామిళ్లగూడెం. తాము ఎంపిక చేసుకున్న గ్రామపెద్ద మాటనే వేదవాక్కుగా అమలుచేయడం ఈ తెగవారి ప్రత్యేకత.





ఏ పిల్లవానికైనా భాష తెలియకపోయినా భావం తెలిసేలా చెప్పగలిగితే ఆ విద్యార్థికి కొంతమేరకు విషయం అర్థం అయ్యేఅవకాశం ఉన్నది. ఈ విభిన్న సంస్కృతీ సంప్రదాయాలు ఉన్న పిల్లలను బడిబాట కార్యక్రమం ద్వారా మా పాఠశాలలో నమోదు చేసుకోవడం జరిగింది.





వీరి ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉండటంవల్ల వీరు ఇతర పిల్లలతో కలవకపోవటం అందరితో సరిగా ఉండలేకపోవడం వలన వీరికి సామర్థ్య సాధనలో కొంత ఇబ్బందిపడ్డాం. వీరికోసం ప్రత్యేక టి.ఎల్.ఎమ్.తో బోధన చేయడం జరిగింది.

మొదట ఈ బోధనోపకరణాలను కేవలం గమనించడం దాని తర్వాత వారికి (KNOWN TO UN KNOWN) తెలిసిన విషయాల నుండి తెలియని విషయాలకు మరల్చడం జరిగినది. సహజ సిద్ధంగా తమంతటతాము నేర్చుకోవడంలో TLM ఇష్టపడుతున్నట్లు గమనించాను.





నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ. పిల్లలు అనేక విషయాలను అనేక సందర్భాలలో సహజసిద్ధంగా నేర్చుకొంటారు. తమకు ఆసక్తి కలిగిన విషయాలను తొందరగాను ఆసక్తిలేని వాటిని నేర్చుకోవటంలో ఇబ్బందులుపడటం గమనించాను. వారు నేర్చుకొనే విధానానికి ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అనుభవాలు, స్వాతంత్ర్య అన్వేషణల** ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. స్వయంగా విద్యార్థి తరగతి గదిలో ఈ బోధనోపకరణాలను పరిశీలించి తాకి తానేదో చేస్తున్నట్లు పొందే అనుభూతి నిజ జీవిత అనుభవాల (Through Real Life Experiences) ఆధారంగా వినియోగించేటట్లు పాఠశాలలో నవకల్పనలు జరగాలని భావించాను.




విద్యలో నాణ్యత కొరకు గుణాత్మక విద్యకై పాటుపడడం, బడిలో చేరిన పిల్లలందరిలో తాము చదవగలుగుతున్నామనే భావనతోపాటు, నేర్చుకోవడానికి అనువైన వాతావరణం కల్పించడం, సంక్లిష్టమైన అంశాలను బాగా తెలిసిన ఉదాహరణలతో అభ్యసనను సరళీకృతం చేయాలి.

ఇలాంటి నేపథ్యం ఉన్న విద్యార్థుల కోసం ఏదైనా చేయాలనే సుదీర్ఘ ఆలోచన తరువాత వారికోసం **GAMING ACTIVITY BASED TLM** రూపొందిచటం జరిగింది. కేవలం పాఠ్యప్రణాళిక ఆధారం కాకుండా ఉపాధ్యాయ శిక్షణలో నేర్చుకున్న అనుభవాలను మరియు SLDP ట్రైనింగ్‌లో పొందిన స్ఫూర్తితో, నూతన ఒరవడితో మా పాఠశాలలో బోధనోపకరణాల ద్వారా బోధించటం జరుగుతున్నది. విద్యార్థులకు వీలైనంతవరకు నిజ వస్తువులను (**Real Objects**) అది సాధ్యంకానపుడు వారి భాషలోని పదాలను నేర్చుకొని ఆ భాషలో చెప్పడం ద్వారా ఆవాస ప్రాంత పిల్లలందరిని పాఠశాలకు రప్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్న మామిళ్లగూడెం ఉపాధ్యాయుల సమిష్ట కృషి వలన తల్లిదండ్రులు కూడా పాఠశాల కార్యక్రమాలలో భాగస్వాములు కావడం ప్రారంభం అయ్యింది.

## Process Followed :

### ఆక్టివిటీ : ఆకారాలు

**విద్యార్థి పేరు : ఎస్. ప్రేమ్ కుమార్** **తరగతి : 3**



రేఖ గణితములోని ఆకారాలను జియో బోర్డు సహాయంతో చతురస్త్ర, దీర్ఘ చతురస్త్ర, త్రిభుజం, రాంబస్, ట్రెపిజియం, పంచభుజి, షడ్ భుజి అష్ట భుజి, ఆకారాలను వాటి చుట్టూ కొలతలను నేర్చుకోవటం జరిగింది.

**అభ్యసన ఫలితం** : వివిధ ఆకారాలు వైశాల్యం పెరిగినప్పుడు వాటి చుట్టుకొలత పెరగవచ్చు, తగ్గవచ్చు అని తెలుసుకున్నాడు. కోణాల తేడాను గుర్తించగలుగుతారు.

### ఆక్టివిటీ : సెంచరీ బోర్డు

**విద్యార్థి పేరు : కీర్తన** **తరగతి : 5**



1 నుండి 5వ తరగతి వరకు తనకు సరిసంఖ్య, బేసిసంఖ్య, గుణిజాల గురించి తెలియదు. కానీ ఈ ఆక్టివిటీ ద్వారా రోమన్ సంఖ్యలు, సరి, బేసి సంఖ్యలు, 3 నుండి 10 వరకు గుణిజాలను గుర్తించడం చేయగలుగుతున్నారు.

**అభ్యసన ఫలితం** : వందలోపు సరి, బేసి గుణిజాలను గుర్తించ గలుగుతారు.

## ఆక్టివిటీ : సంఖ్యలను తెలుసుకుందాం

**విద్యార్థి పేరు : జోగ** **తరగతి : 4**

9999 వరకు అంకెల గ్లాసులను మార్చుకుంటూ సంఖ్యలను గుర్తించటం, వాటి విస్తరణ, సంక్షిప్త రూపాలలో స్థాన విలువలను తీసుకుంటారు.



**అభ్యసన ఫలితం** : 9999 వరకు సంఖ్య విస్తరణ సంక్షిప్త రూపంలో అవగాహన చేసుకుంటారు.

## ఆక్టివిటీ : వదిలేసి చెప్పు

**విద్యార్థి పేరు : జ్యోతి** **తరగతి : 4**

ప్రత్యేకంగా తయారుచేసిన 100లోపు అంకెలు ఉన్న బోర్డు సహాయంతో ఒకే క్రమంలో అంకెలను వదిలేసి చెప్పడంతో వారికి తెలియకుండానే ఎక్కాలు, గుణిజాలు, ప్యాటన్స్ నేర్చుకుంటారు.



**అభ్యసన ఫలితం** : గుణిజాలు, ప్యాట్రన్స్ తెలుసుకొంటారు.

## ఆక్టివిటీ : సంఖ్యలను తెలుసుకుందాం

**విద్యార్థి పేరు : చందు** **తరగతి : 3**

పాత 1000, 100, 10, 1 నమూనా కరెన్సీలను ఒక్కటికి 9 ఉండేలా తీసుకొని విద్యార్థులతో ఏ ఆటను ఆడిరచుట జరిగింది?

ఉదాహరణ : 5263 –

5 – 1000 నోట్లు

2 – 100 నోట్లు

6 – 10 నోట్లు


3 – 1 రూపాయి నోట్లు



**అభ్యసన ఫలితం** : స్థాన విలువలు, విస్తరణ సంక్షిప్త రూపాలలో రాయగులుగుతారు.

## ఆక్టివిటీ : సమయం చెప్పండి

**విద్యార్థి పేరు : రామ్ తేజ** **తరగతి : 4**



గడియారంలోని AM, PM మధ్య తేడాలు తెలుసుకుంటారు.

**అభ్యసన ఫలితం** : నిజ జీవితం AM, PM మధ్య తేడాలను ఖచ్చితంగా గుర్తించగలుగుతారు.

## ఆక్టివిటీ : Cone Festival

**విద్యార్థి పేరు : సుమిత్ర మరియు గ్రూపు** **తరగతి : 3**



పిల్లలు ఒక్కొక్క చేతిమీద అంకెలురాసి రెండు కలిపి చదవడం.

**అభ్యసన ఫలితం** : 99 లోపు అంకెలను సరిగా గుర్తించటము.

## ఆక్టివిటీ : ఈ పాత్ర ఎంత పడుతుంది

**విద్యార్థి పేరు : లక్ష్మణ్** **తరగతి : 5**





1 లీటర్, 1/2 లీటర్ 200ml, 100ml మరియు 50ml కొలపాత్రలతో కొలవడం.

**అభ్యసన ఫలితం** : ద్రవ పరిమాణం లీటర్ మిరియు మిల్లీలీటర్‌లో కొలుస్తారని అవగాహన చేసుకోవడం.

## ఆక్టివిటీ : బిజినెస్ గేమ్

**విద్యార్థి పేరు : లక్ష్మణ్ మరియు గ్రూప్** **తరగతి : 5**

40 సినిమా పేర్లతో Community Chest (లాభం, నష్టం) Chance (లాభం, నష్టం) Jail, Income tax గళ్ళలో ఏర్పాటుచేసుకొని 2 డైస్ సహాయంతో ఆడే ఆట.

**అభ్యసన ఫలితం** : కరెన్సీ విలువలు (2000, 500, 100, 50, 10) dinomination, తక్కువ, ఎక్కువ, తీసివేయడం కూడడం చిల్లర ఇవ్వడం నేర్చుకొంటారు.

ఫలితాల పరిశీలన

నా విద్యార్థులకు నేనెపుడు బోధించను. నేను వారు అభ్యసింగచలుగు పరిస్థితులు కల్పించుటకు మాత్రమే ప్రయత్నిస్తాను''. – ఆల్బర్ట్ ఐన్‌స్టాన్

నేను పిల్లలను ఆటపాటల ద్వారా పాఠాలు చెప్పడం, పిల్లలకు తెలియకుండానే వారు నేర్చుకుంటున్నామనే భావన కలగకుండా, ఈ ప్రత్యేక పెట్టెలో అన్ని గణిత బోధనోపకరణాలను చేసి వాటిని ఉపయోగించి నూతన విషయాలను నేర్చుకొన్నారు. ఇక నాణ్యమైన విద్య అందని ద్రాక్షా పండుగా ఉన్న నేటి పరిస్థితులలో ప్రతీ విద్యార్థి అన్ని సబ్జెక్టులలో తరగతి స్థాయి కలిగి ఉండటం కోసం ప్రత్యేక బోధనోపకరణల ద్వారా బోధన విద్యార్థులు చురుకైన భాగస్వామ్యం వంటివి విద్యార్థిలో అభ్యసనానికి ఎంతో తోడ్పడుతున్నాయి. మా TLM పెట్టె ''ప్రయోగాల ఒడి పెట్టెలో బడి'' విద్యార్థులను ఎంతో ఆకర్షించింది. పిల్లలు బాగా ఆక్టీవ్‌గా పాల్గొనటం ద్వారా అభ్యసన వేగంగా జరుగుతుంది. ఇక్కడ ఇద్దరు పిల్లలు పాఠశాలకు రాకముందు వచ్చిన తరువాత మార్పును మీ ముందు ఉంచాము, మా పాఠశాలలో 100% హాజరుకు ఇదే మా BEST ACHIEVEMENT.



Annexure-2

# ములుగు ప్రాథమిక పాఠశాల మరియు భవిత కేంద్రం – సమన్వయంతో సమ్మిళిత విద్య

సిద్దిపేట జిల్లా, ములుగు మండలం, ములుగు ప్రాథమిక పాఠశాల విశాలమైన ప్రాంగణం కలిగి ఉంది. ఈ పాఠశాల ప్రాంగణంలో భవిత కేంద్రం ఉండడం వలన ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు భౌతికంగా, సౌకర్యంగా రెండు విద్యావ్యవస్థల్లో అభ్యసన కృత్యాలు సమాంతరంగా నిర్వహించడం జరిగింది. ప్రారంభంలో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను భవిత కేంద్రమునకు పంపడం సామాజికంగా వారి స్థాయిని తగ్గించినట్లు అవుతుందని భావించినారు. అందువల్ల భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలుగల బోధనకై నిర్దేశించబడిన Inclusive Education Resource Persons (IERP) ల ద్వారా తల్లితండ్రులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. తద్వారా వారి పిల్లలకై ప్రత్యేక అభ్యసనవాతావరణంలో సహచర విద్యార్థుల సాన్నిహిత్యంతో, వారిలో ఆశించిన విద్య మరియు వ్యక్తిగత, సామాజిక మార్పులు క్రమంగా చూడవచ్చని తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా నిర్ణీత వ్యవధిలో స్వల్పకాలిక, మధ్యమిక, దీర్ఘ కాలిక లక్ష్యాలు నిర్దేశించుకుని పాఠశాలలో లేదా భవిత కేంద్రములో చేర్పించడం జరిగింది. ఈ విధంగా ఈ కేంద్రాలలో చేరి గుణాత్మక మార్పును కనబరచిన కొంతమంది పిల్లల గురించి తెలుసుకుందాం.

## 1.U.హరీష్ మరియు U. పూజ– మానసిక వైకల్యం :-

**ప్రారంభ దశ :-**

మానసిక వైకల్యం గల వీరిని సాధారణ తరగతి గదిలో సమ్మిళితం చేసినప్పుడు ఇతర సాధారణ విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపినారు. వారికి IDEA(Individuals with Disabilities Education Act) మరియు RTE గురించి వివరించి సామాజిక బాధ్యతగా కూడా సహకరించాలని చెప్పాము. ఈ విద్యార్థులు భవిష్యత్తులో స్వతంత్ర జీవనం సాగించేందుకు వారి ప్రత్యేక అవసరాల దృష్ట్యా పాఠశాల మరియు భవిత కేంద్రం సమన్వయంతో బోధనాభ్యసన కృత్యాలు కల్పించాము.వీరి మానసిక సామర్థ్యాలకు అనుసంధానంగా ఉన్న దైనందిన జీవనం, సమాచార నైపుణ్యాలు, భాష, మాటల సంజ్ఞల వ్యక్తీకరణలో సమస్యలను ఎదుర్కొనేవారు. శారీరక సమస్యల వలన అక్షరం కూడా రాయలేని స్థాయిలో ఉండేవారు.

**అభ్యాసనానుభవాలు :-**

సహచర విద్యార్థుల కృత్యాలను చూస్తూ ఉత్సాహంగా చుక్కలు కలుపడం మరియు చూసి రాయడం మొదలగు అభ్యసన కృత్యాలు కల్పించడం జరిగింది. ఈ విద్యార్థుల మౌఖిక అభ్యసనానికై తరచూ పెదవుల కదలికల ద్వారా ఫోనిక్స్ (Phonics) మరియు ఇతర ధ్వనుల ద్వారా, సమవయస్కులతో సంజ్ఞల ద్వారా, సరళమైన పద్ధతులతోశిక్షణ ఇవ్వడం జరిగింది.

**సాధించిన అభ్యాసనా ఫలితాలు :-**

ప్రస్తుతం ఈ విద్యార్థులు సార్, హలో, ఉప్పి (స్నేహితుని పేరు) పదాలు పలుక గలరు. శుభాకాంక్షలు తెలుపగలరు. ఒంటరిగా పాఠశాల మరియు ఇంటికి ప్రయాణం చేయగలరు. స్వతంత్రంగా వచ్చి తరగతిగదిలో నిర్దిష్ట స్థలంలో కూర్చోగలరు. స్వతంత్రంగా స్నానం చేయడం, బట్టలు వేసుకోవడం, చిత్రాలకు రంగులు వేయడం, తినడం, సూచనలను పాటించడం చేయగలరు.

## 2. దిలీప్-ఆటిసం (Autism)

**ప్రారంభదశ :-**

ఏకాగ్రత లేమి, ఇతరుల కళ్ళలోకి నేరుగా చూడలేకపోవడం, శారీరక సంబంధిత సమస్యలు (Fine motor Problems), అస్థిర ప్రవర్తన (Hyperactive) సూచనలు పాటించకపోవడం, చదవలేకపోవడం.

**అభ్యసనాకృత్యాలు :-**

ప్రాథమికంగా ఈ విద్యార్థి స్థిరంగా కూర్చునే విధంగా ప్రణాళిక రూపొందించుకున్నాము. మౌఖిక అభ్యసనానికై, ఆకర్షణీయమైన రంగురంగుల, కదిలే బొమ్మలు, చూపిస్తూ ధ్వనులు, క్రమంగా చిన్న చిన్న పదాలు పలికించే కృత్యాలుచేయించడం.శారీరక సమస్యలు- ఉదాహరణకు పెన్సిల్ సరిగా పట్టుకోలేక పోవడం వంటి సమస్యలను అధిగమించడంలో భాగంగా పెన్సిల్ అడాప్షన్ (pencil adaption), మరియు పట్టుకోసం పెన్సిల్ చుట్టూ టేప్ అతికించడం చేశాము. నిప్పు, హాని కలిగించగల జంతువుల పట్ల చూపాల్సిన వైఖరికై సంబంధిత వీడియోలు ఈ విద్యార్థికి చూపించాము.

**అభ్యసనా ఫలితాలు:-**

సృజనాత్మకంగా చిత్రలేఖనం, ఆంగ్ల అక్షరాలు, సంఖ్యలు చదవడం,రాయడం, సూచనలు పాటించడం, మాటలు, వాక్యాలుపునరావృతం (Repeat) చేయడం, చిన్న పదాలు స్వయంగా మాట్లాడటం, ఆహారం, నీరు అడగటం, తన సోదరిని పేరుతో పిలవడం, మంటలు, జంతువులు ఎదురైనప్పుడు హానికరమని గుర్తించి దూరంగా జరగడం ద్వారా తగువిధంగా ప్రతిస్పందించగలడు. విద్యార్థులకు రిసోర్స్ఫుల్ తరగతి గదులద్వారా, ప్రత్యేక శిక్షణ ద్వారా, భోధనాభ్యసన సామాగ్రి సందర్భానుసారంగా ఉపయోగించే విధంగా సంసిద్ధులను చేశాము.

## 3. లక్ష్మి, మరియు శ్రావణి – దృష్టిమాంద్యం

**ప్రారంభ దశ :–**

ప్రారంభంలో ఈ విద్యార్థినిలు దృష్టిమాంద్యం కారణంగా, నడిచే క్రమంలో వస్తువులను తాకుతూ వచ్చేవారు.

**దృష్టి సంబంధిత సమస్యలు:** బోర్డుపైన వ్రాసిన అక్షరాలను కొంత దూరం నుండి చూడలేక పోయేవారు.

**అభ్యాసనా కృత్యాలు :–**

దృష్టి సంబంధిత సమస్యలు ఉన్నవారు, వినడంలో ఇతర పిల్లలకంటే ఏకాగ్రతతో ప్రతి స్పందించగలరు. అదేవిధంగా ఈ ఇద్దరు పిల్లలు భవిత కేంద్రం మరియు ప్రాథమిక పాఠశాల ములుగు నందు తరగతి గదిలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు పరిశీలిస్తూ, వారికున్న సహజమైన గాత్ర నైపుణ్యం అన్వయించుకుంటూ, ప్రేరణ పొందుతూ, వారి అభ్యసన కార్యక్రమాల్లో ప్రతిస్పందించేవారు. క్రమంగా ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల సామూహిక కార్యక్రమాల ద్వారా మరింత మెలకువలతో పాటలు పాడి జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచారు.

## 4. CH. ఐశ్వర్య మరియు శివ : అభ్యసనా లోపాలు (SLD – Specific Learning Disability)

**ప్రారంభదశ :–**

అశ్రద్ధ, పరాధ్యానం, ఆలస్యంగా ప్రతిస్పందించడం.

**అభ్యసనా కృత్యాలు :–**

ఆకర్షనీయమైన బోధభ్యసన సామాగ్రి, వ్యక్తిగత శ్రద్ధతో ఒక పదాన్ని కొన్ని రోజుల పాటు నేర్పించాము. ముఖ్యంగా చిరునామా, ఫోన్ నెంబరు, వారి పేరు రాయడం నేర్పించడం జరిగింది.

**అభ్యసనా ఫలితాలు :–**

ఈ విద్యార్థులు తెలుగు, ఆంగ్లం అక్షరాలు, సంఖ్యలు చదువ గలరు మరియు రాయగలరు.

## 5. కోలెల్లి శివ – మెదడు పక్షవాతం (Cerebral Palsy)

**ప్రారంభదశ :–**

కండరాల మధ్య సమన్వయ లోపం వల్ల, కదలలేని స్థితి, మాటలు రాకపోవడం వంటివి ప్రధానమైన సమస్యలు.

**అభ్యాసనా కృత్యాలు :-**

ఈ విద్యార్థిని తోటి పిల్లలతో అనుసంధానం చేయటం మరియు గృహ సందర్శన (home based) పద్ధతిలో, వారానికి ఒకసారి ఫిజియోథెరపీ (Physiotherapy) ప్రధానంగా అవలంబించిన పద్ధతులు.

**అభ్యసనా ఫలితాలు :-**

ప్రస్తుతం అభ్యసన మరియు ప్రవర్తన మార్పుల్లో భాగంగా కొన్ని దృశ్యాలకు ప్రతిస్పందించడం, కోపం, నవ్వటం, అరవటం, తనకు తాను రిమోట్ పట్టుకోవడం. ధ్వనుల ద్వారా, సంజ్ఞల ద్వారా, ప్రతిస్పందించడం, కుటుంబ సభ్యులకు స్పందించడం.

**ప్రత్యేక అవసరాలుగల విద్యార్థుల మార్పుకై సమిష్టిగా తీసుకున్న చర్యలు :-**

వారంలో రెండు సార్లు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను, పాఠశాల సమయంలోని చివరి గంట మరియు ప్రతి శనివారము ప్రాథమిక పాఠశాల ములుగునందు సంబంధిత తరగతి విద్యార్థులతో వీరిని సమ్మిళితం చేసి (Inclusion) బోధనాభ్యసన కృత్యాలు కల్పించడంజరిగింది.తల్లిదండ్రుల సహకారంతో, వివిధ సమన్వయ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించగలిగాము. తద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరిగింది, చదువులో పురోగతి కనబడుతుంది, రోజువారిగా జరిగే పాఠశాల కార్యకలాపాలలో సాధారణ విద్యార్థులతో కలిసి చురుకుగా పాల్గొంటున్నారు.